క్లుప్తంగా

నగదు బదిలీపై అవగాహన



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్

డోన్: ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమల్లో వార్డు, సచివాలయ ఉద్యోగుల పాత్ర కీలకమని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళేశ్వరరెడ్డి అధ్యక్షతన ఐపీపీబీ ఖాతాల గురించి సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం నుంచి దళారుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రజల బ్యాంకు, పోస్టల్ ఖాతాలకు నగదు బదిలీ అయ్యే విధానం గురించి వివరించారు.

పచ్చదనం-పరిశుభ్రతకు ప్రాధాన్యత



నెహ్రూనగర్ పార్కులో మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్: పట్టణంలో పచ్చదనం, పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. పారిశ్రామికవేత్త గంగిరెడ్డి ఆర్థిక సహాయంతో స్థానిక నెహ్రూనగర్ మున్సిపల్ పార్కు తదితర ప్రాంతాల్లో గీతాయోగాసన సంఘం సభ్యులు శుక్రవారం 200 మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సమతుల్యత కోసం గీతాయోగాసన సంఘం తమ వంతు కృషి చేస్తుండడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యోగాసన సంఘం గురూజీ రాంపుల్లయ్య, సభ్యులు నాగభూషణంరెడ్డి, గోవిందు, మాకం బాలు, పెద్దయ్య, మల్లి, సప్తశైల తిమ్మయ్య, సముద్రాల బాలు తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు



గాయపడిన రాజు

డోన్ టౌన్: పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై శుక్రవారం బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో కొండపేటకు చెందిన రాజు గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం స్థానిక వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు.

పనిభారం తగ్గించాలని వినతి



ఎంపీడీఓకు వినతి పత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

డోన్ రూరల్: పంచాయతీ కార్యదర్శులకు పనిభారం తగ్గించాలని కార్యదర్శులు రవిచంద్రన్, మోహనాచారి, మురళి, రంగస్వామి, రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసులుకు వినతి పత్రం అందించారు. పంచాయతీ కార్యదర్శులను కించపరిచేలా కలెక్టర్ మాట్లాడడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశిస్తున్న పనులు సక్రంగా చేస్తున్నామన్నారు. తమపై చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని కోరారు. వెంకటరమణయ్య, హరి, రహిమాన్, చింతలయ్య, అనితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవ వైభవంగా సాగింది. ఉదయం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని సుందరంగా ముస్తాబు చేసి పల్లకీలో ఉంచి ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

వెర్రి గోవిందస్వామి ఆరాధనోత్సవం

కొలిమిగుండ్ల: తిమ్మనాయినపేటలోని వెర్రిగోవిందస్వామి ఆలయంలో శుక్రవారం ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. కాగడ హారతిని తిలకించేందుకు భక్తులు పోటీ పడ్డారు. చుట్టు పక్కల గ్రామాలతో పాటు అనంతపురం, వైఎస్సార్ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు.



అవుకు: ప్రత్యేక అలంకరణలో మహాశివుడు



కొలిమిగుండ్ల: జ్వాలా తోరణం వెలిగిస్తూ..



బేతంచెర్ల: మద్దిలేటిస్వామి ఆలయంలో శివులింగాకారంలో కార్తీక దీపాలు



కోవెలకుంట్ల: శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కార్తీకం.. అధ్యాత్మిక శోభితం

వెలుగుతున్న ఒక దీపం మరెన్నో దీపాలను వెలిగిస్తుంది. తిమిరాన్ని తరిమి వెలుగుల తోరణాలను ఇస్తుంది. కార్తీకంలో కైలాసనాథుని స్మరించి వెలిగించే దీపం అనేక పుణ్యఫలాలను ఇస్తుంది. కార్తీక మాసంలో వెలిగించే ప్రతి దివ్వె మంగళప్రదమని, శివకేశవులకు ప్రీతి పాత్రమైనదని భక్తుల నమ్మకం.

- భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి
- కిక్కిరిసిన శివాలయాలు
- దీపాలు వెలిగించిన మొక్కులు తీర్చుకున్న భక్తులు



బేతంచెర్ల: ముచ్చట్ల మల్లికార్జునస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కొలిమిగుండ్ల: భక్తులతో కిక్కిరిసిన లలితా సుందరేశ్వరస్వామి ఆలయం

బనగానపల్లె: డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. భక్తులు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రముఖ శైవక్షేత్రం యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆయన సతీమణి కాటసాని ఉమా మహేశ్వరమ్మ, తనయుడు కాటసాని శివనరసింహారెడ్డి క్షేత్రానికి పైభాగంలో ఉన్న ఎర్రమల కొండలో ఏర్పాటు చేసిన మహా దీపాన్ని వెలిగించారు. పెద్ద ఎత్తున్న భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర నిత్యాన్నదాన సంస్థ నిర్వాహకులు దస్తగిరెడ్డి, రామారెడ్డి, కాశీరెడ్డి ఆశ్రమ నిర్వాహకులు గణపతి స్వామి పాల్గొన్నారు.

బేతంచెర్ల: మండలంలోని హెచ్‌కొట్టాలలో వెలసిన ముచ్చట్ల భ్రమరాంబ, మల్లికార్జునస్వామి, యంబాయి రామలింగేశ్వరుడు, బైనపల్లె, మునలాయిచెర్వు, రహిమానుపురంలోని కాశీవిశాలక్షి, విశ్వేశ్వరస్వామి, సిమెంట్‌నగర్‌లోని జీవ బుగ్గ లింగేశ్వరస్వామి, బుగ్గానిపల్లెలోని నాగలింగేశ్వర స్వామి, పూదోట మఠంలోని భేతేశ్వరుడు, దుర్గాపేటలోని సిద్దేశ్వర స్వామి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. ముచ్చట్ల మల్లికార్జునస్వామి ఆలయంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ నారాయణ, అంజి భక్తులకు అన్నదానం చేశారు. మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు, వేదపండితుల ఆధ్వర్యంలో కార్తీక దీపాలు వెలిగించారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని గాంధీసెంటర్‌లో వెలసిన శివాలయం, నాగలింగేశ్వరస్వామి, పాటిమీద శివాలయం, మారెమ్మ ఆలయం, ఏడుకొప్పెర్ల బావి సమీపంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. అలాగే మండలంలోని భీమునిపాడు పద్మనాభస్వామి ఆశ్రమంలో వెలసిన పంచబ్రహ్మ లింగేశ్వరస్వామి, గుళ్లదూర్తి, కలుగొట్ల, బిజనవేముల, రేవనూరు, సౌదరదిన్నె, తదితర గ్రామాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి.

శివాలయాల్లో కార్తీక శోభ

అవుకు: పట్టణంలోని బలరామేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో మహిళలు స్వామివారిని లింగాకారంలో అలంకరించి చుట్టూ దీపాలు వెలిగించారు.

మారెమ్మ ఆలయ ఆవరణలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని భక్తులకు అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో గౌరీ వ్రతం

డోన్ టౌన్: కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని పలు గ్రామాల్లో గౌరీ వ్రతం(నోములు) జరుపుకున్నారు. పార్వతీపరమేశ్వరులు, వినాయక ప్రతిమలను పసుపుతో చేసి అభిషేకాలు, అర్చనలు, మంగళహారతులు ఇచ్చారు. అష్ట ఐశ్వర్యాలు, సౌభాగ్యం కోసం వ్రతం(నోములు) కథ విని దారాలు ధరించి తీర్థప్రసాద వితరణ చేశారు.

పుణ్యాల పౌర్ణమి

కొలిమిగుండ్ల: స్థానిక లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో భజన మండలి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున కార్తీక దీపాలు వెలగించారు. స్వామిని పుష్పాలతో అందంగా అలంకరించారు. వేదపండితులు ఆలూరి నరసింహప్రసాద్, రాఘవేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఊంజల్ సేవతో పాటు జ్వాలాతోరణాన్ని వెలిగించారు. సీఐ రమేష్‌బాబు, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు చేశారు.



కొలిమిగుండ్ల: దీపాలు వెలిగిస్తున్న మహిళలు



బేతంచెర్ల: శివపార్వతులకు పల్లకీ సేవ



బేతంచెర్లలో జ్వాలా తోరణాలను వెలిగిస్తున్న భక్తులు

ఇన్‌చార్జ్ అధికారులే దిక్కు

కొలిమిగుండ్ల: మండలంలోని పలు ప్రభుత్వ శాఖల్లో కొద్ది రోజుల నుంచి రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ఇన్‌చార్జ్ అధికారులతో పాలన సాగిస్తున్నారు. బదిలీలు పూర్తయి రెండు నెలలు పూర్తయినా రెగ్యులర్ అధికారులను నియమించలేదు. ఉపాధి హామీ పథకం ఏపీఓగా పని చేసిన గంగన్న ఉయ్యాలవాడకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఇప్పటి వరకు ఎవరినీ నియమించలేదు. కార్యాలయంలో విధులు నిర్వహించే టీఏ రాజబాబుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనులకు వెళ్లకపోయినా మస్టర్లలో హాజరు వేసుకుంటున్నట్లు తెలుస్తోంది. వెలుగు కార్యాలయంలో ఏపీఎంగా విధులు నిర్వహించే తిరుపాల్‌రెడ్డి నంద్యాలకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మరొకరిని నియమించలేదు. అవుకు ఏపీఎం చంద్రశేఖర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఇటీవలే ట్రాన్స్‌కో ఏఈ ప్రసన్న ఆంజనేయులు ఎమ్మిగనూరుకు బదిలీ కాగా ఆయన స్థానంలో మరొక ఏఈ రాలేదు. పక్క మండలానికి చెందిన ఏఈకి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఎన్‌సీడీసీని త్వరితగతిన పూర్తి చేయాలి



సర్వేను పరిశీలిస్తున్న ప్రాథమిక వైద్యశాల డాక్టర్ రాంభూపాల్

డోన్ రూరల్: మండల పరిధిలోని కొత్తకోట గ్రామంలో జరుగుతున్న ఎన్‌సీడీ సీడీ 3.0 (నేషనల్ సెంటర్ ఫర్ డిజీజ్ కంట్రోల్) సర్వేను కొత్తబురుజు ప్రాథమిక వైద్యశాల డాక్టర్ రాంభూపాల్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన వారి వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. వీలైనంత త్వరగా సర్వేను పూర్తి చేయాలని తెలిపారు. అలాగే గ్రామాల్లో మధుమేహం, రక్తపోటు, బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) సహా పలు రకాల సస్పెక్టెడ్ కేసులను, స్క్రీనింగ్ పరీక్షలను ఏఎన్‌ఎంలు ఇంటింటికీ తిరిగి త్వరగా పూర్తి చేయాలన్నారు. మలేరియా, డెంగీ జ్వరాలపై అవగాహన కల్పించాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ కె.చంద్రశేఖర్, వైద్య సిబ్బంది ఇందిరా, ఉమా, నాగరత్న, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డేవిడ్ నగర్, కేఈ మాదన్ననగర్, తారకరామనగర్, ఇందిరానగర్, పాతపేట, కొత్తపేట, కొండపేట, టీచర్స్‌కాలనీ, సుందర్‌సింగ్‌కాలనీ, సాయినందన్, శ్రీనివాసనగర్‌తో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

బనగానపల్లె రూరల్: మండలంలోని పాతపాడు, పసుపల సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ మండల ఏఈ శ్రీనివాసులు తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. వ్యవసాయానికి తెల్లవారుజామున 4 నుంచి 9 గంటల వరకు..మళ్లీ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు.

బేతంచెర్ల: మండలంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ టౌన్, రూరల్ ఏఈలు శ్రీనివాసులు, పుల్లయ్య శుక్రవారం తెలిపారు. ఆర్‌ఎస్ రంగాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలు మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

బేతంచెర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 17వ తేదీ (ఆదివారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ తెలిపారు. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అధ్యక్షత వహిస్తారన్నారు. మండల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తప్పక హాజరుకావాలని కోరారు.

బిర్సాముండా జయంతి వేడుకలు



చిన్నరాజుపాళెం తండాలో జయంతి వేడుకలో ఎంపీడీఓ వెంకటరమణ

బనగానపల్లె రూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజన నాయకుడు బిర్సా ముండా జయంతి(జన జాతీయ గౌరవ్ దివస్)ని మండలంలోని గిరిజన గ్రామాలైన రాళ్లకొత్తూరుతండా, చిన్నరాజుపాళెం తండాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకటరమణ మాట్లాడుతూ.. బిర్సాముండా ఆదివాసీల కోసం బ్రిటీష్ వారిపై పోరాటం చేశారని తెలిపారు. అనంతరం గ్రామ సభలు నిర్వహించి అటవీ హక్కుల చట్టాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ మానస వీణ, ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ సతీష్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

బిర్సా ముండాకు నివాళి

ప్యాపిలి: స్థానిక సరస్వతి శిశు మందిరంలో శుక్రవారం బిర్సాముండా జయంతిని నిర్వహించారు. హెచ్‌ఎం రామాంజనేయులు బిర్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 22 ఏళ్ల వయసులోనే బ్రిటీష్ వారిపై యుద్ధాన్ని ప్రకటించిన దేశభక్తుడని కొనియాడారు.

వైభవంగా తిరుచ్చి ఉత్సవం



స్వామివారిని పల్లకీపై ఊరేగిస్తున్న ఆలయ సిబ్బంది

బేతంచెర్ల: ప్రముఖ వైష్ణవ ఆలయమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో కార్తీక మాసం శుక్రవారం రాత్రి స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ముందుగా స్వామివారికి విశేష పూజలు చేశారు. వివిధ పుష్పాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో ఆశీనులను చేశారు. మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు ఆలయ మాడవీధుల్లో విహరించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు, వేదపండితుడు కల్యాణ చక్రవర్తి, ఆలయ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, అర్చకులు మద్దిలేటిస్వామి, మనోహర్, నరసింహా పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

సంజామల: మండల పరిధిలోని ఆల్వకొండ గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి శుక్రవారం మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన రామచంద్రుడు ఇంటి వద్ద బెల్ట్ షాప్ నిర్వహిస్తూ మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారంతో విజయవాడ ఎస్‌టీఎఫ్ పోలీసులు దాడి చేసి 37 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. రామచంద్రుడుపై కేసు నమోదు చేసి కోవెలకుంట్ల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. గ్రామాల్లో బెల్ట్ షాప్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎక్సైజ్ సీఐ తాఖీ బాషా హెచ్చరించారు.

మట్కా బీటర్ల అరెస్ట్

కోవెలకుంట్ల: రేవనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో మట్కాబీట్ నిర్వహిస్తున్న ఇద్దరిని శుక్రవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ భూపాలుడు తెలిపారు. కోవెలకుంట్లకు చెందిన చాంద్ బాషా, రేవనూరుకు చెందిన సురేష్ గౌడ్ మట్కా నిర్వహిస్తుండగా అందిన సమాచారం మేరకు దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి మట్కా చీటీలు, రూ. 1.43 లక్షల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పుస్తక పఠంతో విజ్ఞానం



గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న విద్యార్థినులు

బనగానపల్లె రూరల్: పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని బనగానపల్లె గ్రంథాలయశాఖ అధికారి బషీర్‌అహ్మద్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన జరిగింది. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే గ్రంథాలయాల్లోని పత్రికలు, పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. రోజు పుస్తక పఠనం చేయడం వల్ల మేథోశక్తి పెరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు మొహమ్మద్ రఫీ, శ్రీరాములు, గ్రంథాలయ సిబ్బంది ఉన్నారు.

సద్వినియోగం చేసుకోండి


బేతంచెర్ల: విజ్ఞానం అందించే గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి మధుశేఖర్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని పుస్తక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు మొదలుకొని పెద్దల వరకు గ్రంథాలయంలో కథల పుస్తకాలు, పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

సంక్షిప్తం

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగావకాశాలకు శిక్షణ

డోన్ టౌన్: జనరల్ నర్సింగ్, బీఎస్సీ నర్సింగ్ చేసిన వారికి జర్మనీలో ఉద్యోగావకాశాలు ఉన్నట్లు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ జిల్లా అధికారి శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్మనీ భాష నేర్చుకునేందుకు తిరుపతిలోని సిమ్స్ నర్సింగ్ కళాశాలలో ఆరు నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. 35 ఏళ్లలోపు జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్‌తో పాటు కనీసం రెండు మూడేళ్ల అనుభవం ఉన్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కోఆర్డినేటర్ విజ్ఞేష్ 7981238237ను సంప్రదించాలన్నారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు



రాతన అమల (ఫైల్)

డోన్ రూరల్: మండల పరిధిలోని సోంపురం గ్రామానికి చెందిన రాతన అమల (42) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ మమత తెలిపారు. అక్టోబర్ 28న అమలు ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకుండా పోయింది. ఈ నెల 3న ఆమె భర్త ఆనందరెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కార్యదర్శులపై అనుచిత వ్యాఖ్యలు తగదు

ప్యాపిలి: పంచాయతీ కార్యదర్శులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ రాజకుమారి చేసిన వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు ఫ్రాన్సిస్, శివకుమార్ గౌడ్, శేఖర్, పార్థసారధి తదితరులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఇటీవల నిర్వహించిన టెలీ కాన్ఫరెన్సులో కలెక్టర్ తమను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేశారన్నారు. 10 మంది సచివాలయ సిబ్బందిలో పంచాయతీ కార్యదర్శి కూడా ఒకరని, వారేమీ ఇతర గ్రహాల నుంచి రాలేదని తమను కించపరిచారని తెలిపారు.

జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ

అవుకు: మండల కేంద్రంలోని మదర్ మోడల్ స్కూల్ విద్యార్థులు జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈనెల 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు మహారాష్ట్రలో రాణి లక్ష్మీభాయి బాలికల, మహిళల ఆల్ ఇండియా బాక్సింగ్ టోర్నమెంట్‌లో మదర్ మోడల్ స్కూల్ విద్యార్థినులు నవ్య వెండి పతకం, కరిష్మా, జాహ్నవి, చైతన్యలక్ష్మి, మహిత, సాయిశ్రీ రజత పతకాలు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ ముచ్చలపురి శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. విద్యార్థులతో పాటు కోచ్ చంద్రమౌళిని నంద్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మహబూబ్ బాషా, సెక్రటరీ ఫయాజ్, లీగల్ అడ్వైజర్ అల్లీఉసేన్ సన్మానించారు.

అందరి భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: గ్రామాల అభివృద్ధిలో అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఈఓఆర్డీ మల్లికార్జున ఆధ్వర్యంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్స్, గ్రామైక్య సంఘం మహిళలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సమష్టిగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. నిధులు, ప్రణాళికలపై అవగాహన కల్పించారు.

బడ్జెట్ కేటాయింపుల్లో దివ్యాంగులకు అన్యాయం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

కోవెలకుంట్ల: ఇటీవల కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో దివ్యాంగులకు మొండిచేయి చేపిందని ఆ సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు అందనం దేవరాజు అన్నారు. దివ్యాంగులకు అన్ని విధాలా న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో కూటమి పార్టీకి దివ్యాంగులు మద్దతు తెలిపితే అధికారంలోకి వచ్చాక కేవలం పింఛన్ మాత్రమే పెంచి చేతులు దులుపుకుందని తెలిపారు. ప్రతి దివ్యాంగుడికి రుణాలు, పక్కాగృహాలు, త్రీవీలర్ స్కూటీలు, బస్‌పాసులు ఇవ్వాలని కోరినా ఎలాంటి నిధులు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే బడ్జెట్‌లో రూ. 6వేల కోట్లు కేటాయించి అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు బాషా, సుబ్బరాయుడు, ఓబులేసు, కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.